ఇందిరానగర్ కాలనీ సమస్యలు


తీరేదెన్నడు?

గవర్నర్ నజర్ కోసం ఎదురు చూపులు



ఇందిరానగర్ కాలనీ రోడ్డులో నిత్య గంగగా పొంగుతున్న డ్రైనేజీ

ఖైరతాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహి సేవలో భాగంగా గవర్నర్ ఎంపిక చేసుకొని దత్తత తీసుకున్న ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీలో సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు. సరిగ్గా సంవత్సరం క్రితం గవర్నర్ ఈ బస్తీలో పర్యటించారు. రాజ్ భవన్ అధికారులు ఈ కాలనీని గవర్నర్ దత్తత తీసుకున్నారని తెలిపి అదేరోజున ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఇంటింటి సర్వే నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. దీంతో స్థానికుల్లో ఏదో తెలియని ఆనందం పెల్లుబికింది. ఇక్కడి సమస్యలన్నీ మాయమై ఇందిరా నగర్‌కు మహర్దశ వస్తుందని అనుకున్నా, అది ఆచరణలో మాత్రం అమలు కాలేదు. గవర్నర్ కార్యాలయంతో సంప్రదింపులు జరిపేవారు లేకపోవడం, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లకపోవడంతో ఎలాంటి పనులు ఇక్కడ జరగలేదు.



ఇందిరానగర్ కాలనీ వ్యూ

ఇందిరా నగర్ కాలనీకి 1965లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ శంకుస్థాపన చేశారు. 18 బ్లాక్‌లతో 324 ఇళ్లు నిర్మించారు. అప్పటి జనాభాకు అనుగుణంగా ఏర్పాటైన డ్రైనేజీ వ్యవస్థ శిథిలమవడంతో ఎక్కడ చూసినా డ్రైనేజీలు పొంగుతోన్నాయి.

పెచ్చులూడిన స్లాబ్‌లు..

దాదాపు 60 సంవత్సరాల క్రితం నిర్మాణం ప్రారంభించి 55 సంవత్సరాల క్రితం అలాట్‌మెంట్లు పొందిన ఈ ఇళ్ల స్లాబ్ పై భాగాలు పెచ్చులూడిపడుతున్నాయి. వర్షం వస్తే పై అంతస్థుల వారి స్లాబ్‌ల నుంచి నీళ్లు పడుతున్నాయి. అప్పట్లో కేవలం 32 గజాల్లో కట్టిన ఈ క్వార్టర్లలో స్థలం సరిపోక కిందివారు, పై వారు అదనపు నిర్మాణాలను చేపట్టారు. జి ప్లస్ 2గా నిర్మించిన ఈ క్వార్టర్లలో పైన అదనపు నిర్మాణాలు చేపట్టడంతో భారం ఎక్కువై కుంగిపోయే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొంగుతోన్న డ్రైనేజీలు..

కాలనీలోని సత్తయ్య దుకాణం ఎదురుగా సంవత్సరం పొడవునా డ్రైనేజీలు పొంగడమేగాక మాన్‌హోళ్లు కిందకు దిగి మురుగు నీటితో నిండడంతో ఎంతోమంది అందులో పడి గాయపడుతున్నారు. చాలా బ్లాక్‌లలో డ్రైనేజీలు పొంగి మంచినీటి పైప్‌లైన్లలో కలుస్తుండడంతో తాగునీరు కలుషితమవుతున్నాయి. పైపలైన్లు మార్చితే తప్పా పరిష్కారం లభించేలా కనిపించడం లేదు.

రాకపోకలకు ఇబ్బందులు..

కాలనీ నిర్మాణ సమయంలో ప్రణాళిక ప్రకారం రోడ్లు విస్తారంగా వేశారు. రెండు లారీలు సులువుగా వెళ్లేంత రోడ్లు ఉండేవి. స్థలం సరిపోక కింద ఉన్న వారు అదనపు నిర్మాణాలను చేపట్టడం, వీటి ముందు కంచెలు వేసి ఆక్రమించడం చేశారు. దీనితో రాత్రి సమయాల్లో కనీసం ఒక అంబులెన్స్ రావాలన్నా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. చాలామంది తమ ఇళ్ల ముందు వ్యాపారాలకు వాడే సామాగ్రిని ఉంచడం, మొక్కలు పెంచి ప్రహరీ పెట్టడం, జంతువులకు అవాసాలను ఏర్పాటు చేయడం, ఇళ్ల ముందు వాహనాలను పార్క్ చేయడంతో రోడ్లు కుచించుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కాలనీలోని అన్ని వీధుల్లోకి స్వచ్ఛ ఆటో టిప్పర్లు వెళ్లలేకపోతున్నాయి. దీంతో చెత్తను చాలా మంది బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. గవర్నర్ ఈ కాలనీపై దృష్టి సారించి కనీస వసతుల కల్పనతోపాటు శుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది.



సీఎంతో పుట్టపర్తి సాయిబాబా మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌తోపాటు ట్రస్టు సభ్యులు

పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలకు సీఎంకు ఆహ్వానం

బంజారాహిల్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నవంబరు 23వ తేదీన పుట్టపర్తిలో నిర్వహించనున్న భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతవర్ష జయంతి వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.రత్నాకర్ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు మంగళవారం సీఎంని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానం అందజేశారు. సీఎంను కలిసిన వారిలో గ్లోబల్ కౌన్సిల్ సభ్యులు చలం, సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావు, రాష్ట్ర ట్రస్టు కార్యదర్శి శేషసాయి, జాతీయ కార్యవర్గ సభ్యులు గోపీకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణికి 302 దరఖాస్తులు

బేగంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణికి మంగళవారం 302 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి శాఖలకు 87, రెవెన్యూకు 42, ఇందిరమ్మ ఇళ్ల కోసం 102, ప్రవాసి ప్రజావాణికి 3, ఇతర శాఖలకు చెందిన 68 దరఖాస్తులు వచ్చినట్లు దివ్య దేవరాజన్ తెలిపారు.



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

చిన్నారెడ్డికి సన్మానం

గ్రూప్-2 అభ్యర్థులు సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డిని ప్రభాభవన్‌లో సన్మానించారు. పోస్టింగ్ త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు చిన్నారెడ్డిని కోరారు.

చలో బస్‌భవన్‌ను విజయవంతం చేయాలి



అనూషారామ్

బంజారాహిల్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించనున్న చలో బస్‌భవన్‌ను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకురాలు అనూషారామ్ కోరారు. బస్సు చార్జీలు పెంచిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రజల మధ్యకు వెళ్లి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించిందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల 9న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు తమ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులు, డ్రైవర్, కండెక్టర్ల సమస్యలు అడిగి తెలుసుకుంటారని, బస్‌భవన్ వరకు వెళ్లి వినతిపత్రం ఇస్తారని ఆమె తెలిపారు. ఆర్టీసీ ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొన్నారు.

పెంచిన బస్‌చార్జీలను ఉపసంహరించుకోవాలి

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్సు అంటూనే.. వారి కుటుంబసభ్యులపై బస్ చార్జీల భారంమోపడం తగదని పేర్కొన్నారు. బస్సు ప్రయాణికులు, పేదలను కలుపుకొని బీఆర్‌ఎస్ తరఫున ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పటికే గౌలిగూడ బస్టాండ్‌ను ప్రైవేట్‌కు ఇచ్చిందని, ఇతర బస్టాండ్‌లను ప్రైవేట్‌కు ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆర్టీసీ సంస్థను కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ వినూత్న కార్యక్రమాలు చేపట్టనుందని, అందులో భాగంగానే ఈనెల 9న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర ముఖ్యనేతలు బస్సు ప్రయాణంతో బస్ భవన్‌కు చేరుకొని ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం ఇస్తారని తెలిపారు.

కొండాపూర్ 8వ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

గచ్చిబౌలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని నిమ్స్ హాస్పిటల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, రవిచంద్ర, రహీమాన్, సత్యనారాయణ, పార్థసారధిరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ సాఫీగా వెళ్లేందుకు పాటించాల్సిన నిబంధలను వివరిస్తున్నారు. మంగళవారం నార్సింగిలో 150 మంది ఆటో డ్రైవర్లతో మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆటో డ్రైవర్లపై ఇటీవల కాలంలో ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వారితో సమావేశమై రోడ్ల మీద ఖచ్చితమైన నిబంధనలను సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని, ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే, రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 400మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలనపై పోలీసులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వారికి అక్కడి రికార్డులను, ట్రాఫిక్ పోలీసుల విధులను, సిగ్నల్ మేనేజ్‌మెంట్, పాదాచారుల భద్రత, జీబ్రా క్రాసింగ్ వంటి అంశాలను వారికి వివరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడకు చెందిన ఎం.నారాయణస్వామి(47) కొన్నేళ్లుగా మధురానగర్ ప్రాంతంలో ఉంటున్నాడు. ఈయన నివాసం ఉండే గది నుంచి సోమవారం దుర్వాసన రావడంతో స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులను పగలగొట్టి చూశారు. మృతదేహం కుళ్లిపోయి ఉంది. అంబులెన్స్ సిబ్బంది, క్లూస్ టీం పరిశీలించి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లీ, కొడుకుపై ట్రాఫిక్ పోలీస్ దాడి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లీ, కొడుకుపై ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌కు చెందిన గూడెం చైతన్య ఈనెల 2న బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్నాడు. సమీపంలో ఉంటున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ రహస్యంగా కిటికీలో నుంచి వీడియోలు తీశాడు. గమనించిన చైతన్య తల్లితో కలిసి నరేష్‌ను ప్రశ్నించారు. తల్లి ముందే చెంపపై కొట్టి బెదిరింపులకు దిగాడని మంగళవారం పోలీసులకు చైతన్య ఫిర్యాదు చేశాడు.

మారిషస్ ట్రిప్ పేరిట మోసం

బంజారాహిల్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మారిషస్ వెళ్లేందుకు ఓ యువకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా ఓ ట్రావెల్ ఏజెంట్ తగిలాడు. తక్కువ ధరకే ట్రిప్పు పేరిట ట్రావెల్ ఏజెంట్ డబ్బు వసూలు చేసి మోసం చేశాడు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.13కు చెందిన కె.నితిన్‌రెడ్డి మారిషస్ వెళ్లేందుకు ట్రావెల్ ఏజెంట్ కోసం ఇంటర్నెట్‌లో వెతికాడు. ట్రావెల్ మేజిక్ అనే టూర్ సంస్థ ప్యాకేజీ నచ్చింది. సంస్థకు ఫోన్ చేయగా అంకిత్ పాండే అనే వ్యక్తి అందుబాటులోకి వచ్చాడు. మారిషస్ వెళ్లేందుకు ఏర్పాట్ల నిమిత్తం నితిన్‌రెడ్డి నాలుగు లక్షల రూపాయలు చెల్లించాడు. తీరా ప్రయాణం తేదీ ముందు నుంచి ట్రావెల్ ఏజెంట్ ఫోన్‌కు స్పందించడం మానేశాడు. మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసన



మింట్ కాంపౌండ్‌లో నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై సనాతన ధర్మం ముసుగులో జరిగిన మనువాద దాడిని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి రమేష్ తెలిపారు. ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు, నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఈ దాడిని భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే భావిస్తున్నామన్నారు. దేశంలో వేల ఏళ్లుగా అవమానాలకు గురవుతున్న జాతులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారం దక్కాలన్నారు. ఇంతకాలం అవమానాలు, అణిచివేతలకు గురైన వర్గాల ప్రజలే ఇప్పుడు దేశాన్ని పాలించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనువాదులతో అహర్నిశలు పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సంఘాల రాష్ట్ర నాయకులు చంద్రయ్య, ఆనంద్ బాబు, బీచుపల్లి, రవీందర్, శరబంద, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

- బోరబండలో ఉప ఎన్నిక ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే వివేకానంద



అన్నానగర్ బస్తీలో దివ్యాంగుడికి 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను అందజేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్

బోరబండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పిలుపునిచ్చారు. బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీ అన్నానగర్‌లో దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత, తనయుడు మాగంటి వాత్సల్యనాథ్‌తో కలిసి 'కాంగ్రెస్ బాకీ కార్డు' పంపిణీ కార్యక్రమంతో ఉప ఎన్నికల ప్రచారానికి ఆయన మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే మాగంటి చొరవతోనే అన్నానగర్ బస్తీ నిలబడిందని గుర్తు చేశారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను వందరోజుల్లో అమలు చేస్తానన్న ప్రభుత్వం 700 రోజులైనా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అమలుకానీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, అందుకే బాకీ కార్డును చూపించి ఓట్ల కోసం వచ్చే ఆ పార్టీ నాయకులను నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోసం ముగ్గురు మంత్రులు నియోజకవర్గంలో హడావుడి చేస్తున్నారని, కాలయాపన తప్పా పనులు మాత్రం జరగడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం పెంచే దిశగా 'సప్తశక్తి సంఘం' ప్రారంభం



'సప్తశక్తి సంఘం' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, వెంకటలక్ష్మి తదితరులు

పంజాగుట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళా లోకంలో చైతన్యం పెంచే దిశగా 'సప్తశక్తి సంఘం' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు విద్యాభారతి దక్షిణ భారత క్షేత్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు తెలిపారు. సప్త శక్తి సంఘం ప్రారంభిస్తున్న సందర్భంగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యా భారతి అఖిల భారత ప్రచార ప్రభారీ లింగం సుధాకర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మితో కలిసి ఆయన బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. సప్తశక్తి సంఘం ద్వారా సుమారు 76 లక్షల మంది మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాణి దుర్గావతి జయంతి సందర్భంగా ఈనెల 5 నుంచి మొదలు పెట్టామని, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి జనవరి 23 వరకు జరుపుతామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 24 వేల విద్యా భారతి విద్యాలయాలతో పాటు, రాష్ట్రంలోని 225 విద్యాలయాల్లో మాతృ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంఘటనా మంత్రి పి.శ్రీనివాస్, రాష్ట్ర శిశు వాటిక ప్రముఖ్ కొత్తపల్లి ఉమ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ ఫోకస్



కాళీమందిర్ మార్గంలో ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

హైదర్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను మంగళవారం తొలగించారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న ఆధ్వర్యంలో నిజాంపేట్ నుంచి బాచుపల్లికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలతో పాదచారులు ఇబ్బందులు పడడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని డీసీపీ పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలు తొలగించామని, మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్, నార్సింగి ప్రాంతాల్లో..

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌జామ్‌లకు కారణమవుతున్న ప్రాంతాల్లో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంగళవారం మియాపూర్, నార్సింగ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి రోడ్ల మీద, ఫుట్‌పాత్‌లపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన షాపులను, తోపుడు బండ్లను తొలగించారు. నిజాంపేట హనుమాన్ ఆలయం నుంచి నిజాంపేట ఎక్స్ రోడ్డు వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ సాఫీగా వెళ్లేలా చేశారు. అలాగే, నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్‌సిటీ బండ్లగూడ జాగీర్, కాళీమందిర్ ప్రాంతంలోనూ ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడవలేని పరిస్థితులు ఉండడంతో ఈ ఆక్రమణలను తొలగించామని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించే కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఖైరతాబాద్ ఉప కమిషనర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

ఖైరతాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్‌గా బి.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ స్థానంలో పనిచేసిన జయంత్ విదేశాలకు వెళ్లడంతో గోషామహల్ సర్కిల్ ఉపకమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో మలక్‌పేట, కార్వాన్, ఉప్పల్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో శ్రీనివాస్‌కు ఉప కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సర్కిల్‌లో పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తానే సమస్యలపై అధికారులు వెంటనే స్పందించేలా చూస్తానని తెలిపారు. పారిశుధ్య సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.



ఫస్ట్ ఫర్ ఎవర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శోభారాణి తదితరులు

ఆర్కిటెక్చర్ రంగంలో విప్లవాత్మక మార్పులు

ఖైరతాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధతో ఆర్కిటెక్చర్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని వక్తలు పేర్కొన్నారు. స్కెచింగ్, మోడల్ తయారీ, డిజైనింగ్‌లలో ఏఐ సాంకేతికత కీలకం కానున్నదని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఇక్ఫాయ్ స్కూల్ అఫ్ ఆర్కిటెక్చర్, ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని అబోడ్ వెంకటేశ్వర హోటల్‌లో 'ఆర్కిటెక్చర్ రంగంపై కృత్రిమ మేధ ప్రభావం' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఆర్కిటెక్చర్ డే సందర్భంగా జరిగిన సదస్సులో దేశంలోని ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు, ఏఐ నిపుణులు పాల్గొని విద్యార్థులకు ఏఐ పాత్ర వినియోగించడంపై వివరించారు. విశిష్ట అతిథులుగా కొల్హాపూర్ నుంచి శిరీష్ బేరి, డాక్టర్ మానిమో వియోనిల్లాలు హాజరయ్యారు. అంతర్జాతీయ జ్యోతిష్య, వాస్తు నిపుణులు రవిరావు కృత్రిమ మేధపై మన వేదాలు పోషించిన పాత్రపై వివరించారు. ఈ సందర్భంగా ఇక్ఫాయ్ వ్యవస్థాపకులు ఎన్‌జే యశస్వి జీవిత చరిత్రపై తయారైన 'ఫస్ట్ ఫర్ ఎవర్' పుస్తకాన్ని ఇక్ఫాయ్ సొసైటీ చైర్‌పర్సన్ శోభారాణి ఆవిష్కరించారు. సదస్సులో సలహాదారులు వెంకట్ పీసపాటి, ప్రిన్సిపాల్ డాక్టర్ మహేంద్ర సోనావాని, కన్వీనర్ డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా హైడ్రా ప్రధానకార్యాలయంలో ఆయన చిత్రపటానికి హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ నివాళులర్పించారు. అలాగే, ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను చాటిన శ్రీ రామాయణ మహాకావ్య రచయిత, ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా హైడ్రా కమిషనర్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవడానికి ఇంప్లీడ్ పిటీషన్



మాట్లాడుతున్న సత్యనారాయణ

బర్కత్‌పుర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవడానికి హైకోర్టులో కొనసాగుతున్న వాదనలకు మద్దతుగా ఇంప్లీడ్ పిటీషన్ దాఖలు చేసినట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జక్కుల వంశీకృష్ణ, బీసీ ఐక్య కులాల వేదిక అధ్యక్షుడు పాండు యాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరహరి, వివిధ సంఘాల నేతలు అరుణ్ కుమార్, సురేందర్ యాదవ్, పి.నర్సింహులు ముదిరాజ్ పాల్గొన్నారు.



అంబేడ్కర్‌నగర్ బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న జంపన

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కృషి: జంపన

సికింద్రాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలంరాయి ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లో అంగన్‌వాడీ పాఠశాల భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ హామీ ఇచ్చారు. మంగళవారం అంబేడ్కర్‌నగర్ బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలు ఆయనకు మొర పెట్టుకున్నారు. అంగన్‌వాడీ పాఠశాల భవనాన్ని నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లను కూల్చివేయాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ త్వరలోనే అంగన్‌వాడీ పాఠశాల భవనం, కమ్యూనిటీ హాలు నిర్మాణం, టాయిలెట్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్, జమీల్, దాల్ రాజు, అన్నానగర్ మురళి, చంటి తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండీలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పర్యటించారు. ఎస్‌బీఐ లేన్‌లో నెలకొన్న సమస్యలపై స్థానికులతో చర్చించారు. తాగునీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు చేయగా, తగిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నూతన వాటర్‌లైన్‌ను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆస్పత్రి ప్రాంతంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు బి.రామారావు, అనిల్ పాల్గొన్నారు.



సికింద్రాబాద్ కోర్టులో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సీజేఐపై దాడి అమానుషం : రాజశేఖర్ రెడ్డి

అడ్డగుట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కోర్టులో ఉన్న సమయంలో ఓ లాయర్ బూటు విసరడం అత్యంత దారుణమని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంగళవారం సికింద్రాబాద్ కోర్టులో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు బయట నిరసన వ్యక్తం చేశారు. సీజేఐపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్థన్‌రెడ్డి, న్యాయవాదులు స్వామి, సంతోష్ కుమార్, బిసమంత, పావని, మహేశ్వరిలతో పాటు మాజీ అధ్యక్షుడు వసంత్ కుమార్, టీవీ రమణలు పాల్గొన్నారు.

గాంధీ మెడికల్ కాలేజీలో బీసీఎంఈ కోర్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర

అడ్డగుట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గాంధీ మెడికల్ కాలేజీలో నిర్వహించిన మెడికల్ ఎడ్యుకేషనల్ ప్రాథమిక కోర్సు (బీసీఎంఈ) కోర్సును గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ వ్యాపితంగా మెడికల్ విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో ఎన్ఎంసీ ప్రవేశపెట్టిన సీబీఎంఈ (కంపిటెన్సీ ఆధారిత మెడికల్ ఎడ్యుకేషన్) లో భాగంగానే నిర్వహిస్తున్నామన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్‌రావు, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, రీజినల్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ కిరణ్ మాదాల, కో-కన్వీనర్ ప్రొఫెసర్ సుభోద్ కుమార్, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మిలతో పాటు ఎంఈయూ సభ్యులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

అడ్డగుట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వాణిని మంగళవారం బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు, పార్కింగ్, మార్చురీ వద్ద వ్యాపిస్తున్న దుర్వాసన వంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, చంద్రపాల్ రెడ్డి, కీరీటా, గోపి, శ్రీనివాస్, స్వామిలు ఉన్నారు.

ఢిల్లీ నుంచి నగరానికి అక్రమ మద్యం

● 44 బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు



ఢిల్లీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్‌సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి హైదరాబాద్ నగరానికి తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైల్లో అక్రమంగా సరఫరా అవుతున్న మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. 44 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో మద్యాన్ని కొనుగోలు చేసిన నిందితులు రైల్లో గుట్టుగా హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య తన సిబ్బందితో కలిసి రైల్లో తనిఖీలు నిర్వహించగా.. రైల్లో 44 బాటిళ్ల అక్రమ మద్యం బాటిళ్లు దొరికాయి. అప్పటికే పోలీసులను గుర్తించిన నిందితులు తప్పించుకున్నారు. సీజ్ చేసిన మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

రైలునుంచి జారి పడి ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైలు నుంచి ఓ ప్రయాణికుడు కింద పడి అక్కడికక్కడే మరణించిన ఘటన రామకృష్ణాపురం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపురం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబరు 2పై మంగళవారం కదులుతున్న రైలు నుంచి జారిపడిన గుర్తుతెలియని ప్రయాణికుడు కింద పడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 8712658581 నంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అపరిశుభ్రతకు నిలయం..

ఆర్ట్స్ కాలేజీ రైల్వేస్టేషన్

● భారీగా చెత్త డంపు
● అవస్థలు పడుతున్న ప్రయాణికులు
● అక్రమ పార్కింగ్‌తో సైతం ఇబ్బందులు



ఆర్ట్స్ కాలేజీ రైల్వేస్టేషన్ వద్ద వాహనాల అక్రమ పార్కింగ్





ఆర్ట్స్‌కాలేజీ రైల్వేస్టేషన్ ముందు ఉన్న చెత్తా చెదారం

బౌద్ధనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే అధికారులు పెద్ద రైల్వేస్టేషన్లపై పెడుతున్న శ్రద్ధ చిన్న రైల్వేస్టేషన్లపై పెట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సికింద్రాబాద్, కాచిగూడ ప్రధాన రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఆర్ట్స్ కాలేజీ రైల్వేస్టేషన్‌ను అధికారులు పట్టించుకోకపోవటంతో అపరిశుభ్రతకు నిలయంగా మారింది. దీంతో ఈ రైల్వేస్టేషన్లో సమస్యలు తాండవిస్తున్నాయి. రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ముందు ఉన్న ఖాళీస్థలంలో చెత్త పేరుకుపోయి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిన చెత్త వల్ల విపరీతమైన దుర్వాసన వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజుల నుంచి చెత్త పేరుకుపోయిందని, చాలామంది రాత్రిళ్లు చెత్తను ఇక్కడ పడవేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా చెత్తను తొలగించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్యకలపాలు జరుగుతుంటాయి. అధికారులు ఇక్కడే నుండే పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తుంటారు. ఆటో రిక్షాల ద్వారా తీసుకువచ్చే చెత్తను లారీల ద్వారా తరలిస్తుంటారు. కనీసం వందమీటర్ల దూరంలో ఉన్న రైల్వేస్టేషన్ ముందు పేరుకుపోయిన చెత్తను తొలగించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

అక్రమ పార్కింగ్

ఇక్కడ క్యాబ్‌లు, ఇతర వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేయటంతో రైల్వేస్టేషన్‌కు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సందర్భాలు చాలా ఉన్నాయని, ఇక్కడ అలాంటి సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే చాలామంది మద్యం సేవిస్తుంటారని, దీంతో మహిళలు రాత్రిళ్లు ఈ స్టేషన్‌కు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రాత్రిళ్లు ఈ స్టేషన్ వద్ద పోలీసుల గస్తీని పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఇష్టారాజ్యంగా పార్కింగ్

అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలి. ఈ పార్కింగ్ చేసిన వాహనాల వల్ల అసాంఘిక కార్యకలపాలు జరిగే అవకాశాలున్నాయి. ఈ విషయంలో పోలీసులు, జీఆర్‌పీ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవటంలేదు. అలాగే రైల్వేస్టేషన్ ముందు విపరీతంగా చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

\- బెజ్జంకి రాజేష్, జామై ఉస్మానియా



సమస్యలు పరిష్కరించండి

రైల్వేస్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలి, ప్రయాణికులకు సరైనా సదుపాయాలు కల్పించాలి. విపరీతంగా పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన రావటంతో అవస్థలు పడుతున్నారు. దీనిపై రైల్వే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో అర్థం కావటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్లో సమస్యలను పరిష్కారించాలి.

\- కటుకం శ్రీనివాస్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, బౌద్ధనగర్

ఓట్ చోరీ ఉద్యమంపై రాష్ట్రపతి స్పందించాలి: ఏఐసీసీ

● ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథన్

సికింద్రాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశంలో జరుగుతున్న ఓట్ చోరీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న అవిశ్రాంత పోరాటంపై రాష్ట్రపతి స్పందించాలని ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ విశ్వనాథన్ కోరారు. ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్ల తొలగించడం ద్వారా కేంద్రంలోని మోదీ సర్కారు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారంటూ రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమం అన్ని వర్గాల ప్రజలను ఆలోచనలో పడేసిందని ఆయన అన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం కూడా పట్టించుకోనందున రాష్ట్రపతి స్పందించాలని ఆయన కోరారు. ఈ పోరాటానికి మద్దతుగా కంటోన్మెంట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం బాలంరాయి చౌరస్తాలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఓట్లను దొంగలించడం అమానుషమని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఓట్లను చోరీ చేస్తూ, దొడ్డిదారిన అధికారంలోకి వస్తున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నాటకలో ఓట్ల చోరీకి పాల్పడిన వైనం గురించి తాము సాక్ష్యాలతో బయటపెట్టామని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా రాష్ట్రంలోనే తొలిసారిగా సంతకాల సేకరణను కంటోన్మెంట్‌లో నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఓట్ల చోరీకి పాల్పడక పోయి ఉంటే గడిచిన ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉండేదని అన్నారు. దేశంలోని యువత రాజకీయాల్లోకి వచ్చి చైతన్యం కావాలన్న ఆలోచనతో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కలిగిస్తే, ప్రస్తుత మోదీ ప్రభుత్వం అర్హులైన ఓట్లను చోరీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నదని ఆరోపించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు గౌడ్, మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, నాయకులు బద్రీనాద్‌యాదవ్, ఎస్.రాజేష్‌యాదవ్, సంతోష్‌యాదవ్, సంకి రవీందర్, బద్దం బల్వంత్ రెడ్డి, జమీల్, రేపాల వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ కంటోన్మెంట్ అధ్యక్షురాలు భవానీ, గోమతి తదితరులు పాల్గొన్నారు.



లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు వార్నింగ్ ఇస్తున్న ఏసీపీ శశాంక్ రెడ్డి

రౌడీ షీటర్లకు ఏసీపీ మాస్ వార్నింగ్

అడ్డగుట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఈస్ట్ జోన్ ఏసీపీ శశాంక్ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ పోలీస్ స్టేసన్ పరిధిలో ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీ ప్రవర్తన మారాలని, ఎలాంటి లావాదేవీల్లో తలదూర్చవద్దని, మీపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



పోచమ్మ ఆలయంలో జరిగిన పారిశుధ్య కార్మికుల పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్

పారిశుధ్య కార్మికుల పూజలు

బౌద్ధనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోచమ్మ ఆలయంలో మంగళవారం స్థానిక పారిశుధ్య కార్మికులు పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని కనకదుర్గ అమ్మవారికి, పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలను కూడా లెక్కచేయకుండా నవరాత్రుల్లో మండపాల వద్ద కార్మికులు పరిశుభ్రతను చేపట్టారని, వారు చేసిన సేవలను అభినందించాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు సిద్ధం.. త్వరలో అందిస్తాం

● డిప్యూటీ తహసీల్దార్ రజని



లబ్ధిదారులకు వివరణ ఇస్తున్న నాయాబ్ తహసీల్దార్ రజని

రాంగోపాల్‌పేట్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి) : కొందరి కళ్లల్లో ఆనందం కనిపిస్తే మరి కొందరి కళ్లల్లో ఆవేదన కనిపిస్తుంది. ఈ పరిస్థితి రసూల్‌పురా నారాయణ జోపిడి బస్తీ వాసుల కళ్లలో కనిపిస్తుంది. గత నెల 28వ తేదీన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, స్థానిక శాసన సభ్యులు శ్రీగణేశ్‌లు ఈ బస్తీ వాసులకు 210 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మిగిలిన 78 మంది లబ్ధిదారులకు పేరులో తేడా ఉండటం, చనిపోవడం వంటి కారణాలతో పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారు ప్రతిరోజు సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ క్రమంలో శనివారం వస్తే కొందరిని సోమవారం రమ్మని మరికొందరిని మంగళవారం రమ్మని చెప్పడంతో వారందరూ మంగళవారం పట్టాలు అందని వారందరూ మాకు పట్టాలు కావాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు కూర్చున్నారు. దీనితో ఆ సమయంలో అందుబాటులో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ రజని వారిని సముదాయిస్తూ అందరికి పట్టాలు వస్తాయని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పట్టాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిపై ఆర్డీఓ సంతకం కావాల్సి ఉందని, ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో కోడ్ తర్వాత మాత్రమే పట్టాలు ఇవ్వడం కుదురుతుందని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

బతికుండగానే చంపేశారు

నేను బతికుండగానే నన్ను చంపేశారని బస్తీవాసి భారతమ్మ తన ఆవేదనను వెళ్లగక్కింది. లబ్ధిదారుల లిస్టులో నా పేరును పక్కన నేను చనిపోయానని రాసుకున్నారు. దీనితో నాకు పట్టా రాలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగి నేను బతికే ఉన్నా అని నిరూపించుకోవాల్సి వచ్చింది. ఇప్పుడేమో పట్టాపై సంతకం కాలేదని, ఎన్నికల కోడ్ వచ్చిందని చెపుతున్నారు. నాలాగే ఎందో మంది ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు.

\- భారతమ్మ, నారాయణ జోపిడి బస్తీవాసి

కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ బదిలీ

కొత్త సీఈఓగా అర్విండ్‌కుమార్ ద్వివేదీ

సికింద్రాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్య నిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ బదిలీ అయ్యారు. న్యూఢిల్లీలోని డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టరేట్ జనరల్‌లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఆయనను బదిలీ చేశారు. కాగా ప్రస్తుతం అక్కడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న అర్విండ్‌కుమార్ ద్వివేదీని మధుకర్ నాయక్ స్థానంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓగా బదిలీ చేశారు. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మధుకర్ నాయక్ కంటోన్మెంట్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించి దాదాపు మూడు సంవత్సరాలు అవుతోంది. దాంతో గడిచిన కొద్ది నెలలుగా నేడో, రేపో అంటూ ఆయన బదిలీపై ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఐడీఈఎస్ 2010వ బ్యాచ్‌కు చెందిన అర్విండ్‌కుమార్ ద్వివేదీ ఉత్తరప్రదేశ్ వాస్తవ్యులు. మరో రెండు, మూడు వారాల్లో ఆయన కంటోన్మెంట్ సీఈఓగా బాధ్యతలు చేపట్టవచ్చని చెబుతున్నారు.

సీఎం ప్రజావాణికి 302 దరఖాస్తులు

బేగంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణికి మంగళవారం 302 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి శాఖలకు 87, రెవెన్యూకు 42, ఇందిరమ్మ ఇళ్ల కోసం 102, ప్రవాసి ప్రజావాణికి 3, ఇతర శాఖలకు చెందిన 68 దరఖాస్తులు వచ్చినట్లు దివ్యదేవరాజన్ తెలిపారు.



అన్నదానం చేస్తున్న నర్సింహన్, అరవింద్‌లు

ఘనంగా పౌర్ణమి వేడుకలు

తిరుమలగిరి అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో మంగళవారం పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొల్లారం, సదర్‌బజార్, అంబేడ్కర్ నగర్, టీఏటీ క్వార్టర్స్, స్నేహా కాలనీ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్.కనిష్క, బాలరాజు, పూర్ణచందర్, నరేందర్, నాగేందర్, దత్తు, చంద్రశేఖర్, రాకేష్, సుమన్, రషీద్, రాజు, అబ్బయ రాజు, ప్రగతి, విజయలక్ష్మీ, చంద్రకళ, తులసీ, ఉమ, సులోచన పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డులోని సీతారంపురంలో శివ పంచాయతన హనుమాన్ ఆలయంలో ప్రతి పౌర్ణమి రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్టు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం అన్ని దానాల కన్నా గొప్ప దానమన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, మనోహర్, రాజేందర్, శ్రీకాంత్ రెడ్డి, నారాయణ చారి తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపురం శివ పంచాయతన హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

చిన్నారులు దాతృత్వాన్ని అలవర్చుకోవాలి



నిత్యావసరాలు వితరణ చేస్తున్న యూరో కిడ్స్ ప్రీ స్కూల్ ప్రతినిధులు

మారేడుపల్లి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే చదువుతో పాటుగా చిన్నారుల్లో దాతృత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించాలని మహేంద్రహిల్స్‌లోని యూరో కిడ్స్ ప్రీస్కూల్ శాఖ ఫ్రాంచైజీ యజమానులు హర్షద, సురేష్ బంద్రెడ్డి దంపతులు పేర్కొన్నారు. దాన్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్కూల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధులు స్థానికంగా ఉన్న మంచి కలలు బాలల అనాధాశ్రమానికి మంగళవారం 50 రకాల నిత్యావసరాలను వితరణ చేశారు. ఆశ్రిత నర్చ్యురింగ్ హబ్ బోర్డు సభ్యులు పొలం విజయకుమార్ యాదవ్, చంద్రకళ దంపతులు, స్కూల్ ప్రిన్సిపల్ దివ్యగౌరిశెట్టిలు మాట్లాడుతూ అనాథలను ఆదుకోవడానికి పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనాథాశ్రమ నిర్వాహకులు శరత్ కుమార్, పుష్పాలా తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర నూతన డీజీపీ శివధర్‌రెడ్డిని మంగళవారం తెలంగాణ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకని శివప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సహస్ర ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. డ్రగ్స్ నిర్మూలనలో సహస్ర ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



రమేష్ గౌడ్‌ను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలస్థాయిలో ఉత్తమ పీఈటీగా ఎన్నికై సికింద్రాబాద్ కీస్ హై స్కూల్‌లో డిప్యూటీ డీఈఓ గుండప్ప చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్ గౌడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాకూబ్ చారీ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాకూబ్ చారీ మాట్లాబడుతూ... రమేష్ గౌడ్ మరిన్ని అవార్డులను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలేందర్, భూపాల్, విజయ లక్ష్మీ, అరుణ, ఎడినా తదితరులు పాల్గొన్నారు.